విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

విప్లవవీరుడు అల్లూరి

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: బ్రిటీష్ వారిని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా ఎస్.పి. డి. మేరి ప్రశాంతి కొనియాడారు. గురువారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి. మేరీ ప్రశాంతి మాట్లాడుతూ విప్లవ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా 1922లో రంప తిరుగుబాటుకు నాయకత్వం వహించారన్నారు. గెరిల్లా యుద్ధంలో శక్తివంతమైన వ్యూహకర్తగా గుర్తింపు పొందారన్నారు. పోడు వ్యవసాయం గిరిజనుల హక్కులకోసం అహర్నిశలు బ్రిటిష్ పాలకులకు ఎదురు నిలిచిన మహా విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి.తో పాటు డిటిసి డి.ఎస్.పి. కే ప్రభాకర్ రావు, ఏ.ఆర్. అదనపు ఎస్.పి. ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏ ఆర్ డి ఎస్ పి శ్రీహరి, ఏ ఆర్ ఆర్ ఐ పవన్ కుమార్, ఆర్.ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల నిర్వహణ మెరుగ్గా ఉండాలి

కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల నిర్వహణ మెరుగ్గా ఉండాలని జిల్లా కలెక్టరు సి.నాగరాణి సంబంధిత సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేటు ఛాంబరులో జిల్లా కలెక్టరు సి.నాగరాణి జిల్లా ఎస్సి,ఎస్టి, బిసి సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై జిల్లాలోని వసతి గృహాల నిర్వహణపై విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో శాఖల వారీగా ఎన్ని సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి, ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, వసతి గృహాల స్థితిగతులు, తదితర అంశాలపై ఆరా తీశారు. సంక్షేమ వసతి గృహాలు మెరుగైన రీతిలో నిర్వహణ ఉండాలని, లోపాలు ఉంటే ఉపేక్షించేది లేదన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు చదువులో మెరుగ్గా రాణించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటులో తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలో ఎస్సీ -ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 25, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు 13, ఎస్టి పోస్టుమెట్రిక్ వసతి గృహాలు రెండు, బిసి ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 14, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు 15 మొత్తం 69 వసతి గృహాలు ఉన్నాయన్నారు. కొన్ని వసతి గృహాల్లో డ్రైనేజీలు, రన్నింగు వాటరు అవసరం ఉందని ఈ సందర్భంగా సంక్షేమ సంక్షేమ శాఖ అధికారులు జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్ప రాణి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి వి ఆర్ కె ఎస్ ఎస్ గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు పురపాలక సంఘం ఎక్స్ అఫిషియో సభ్యులుగా పార్థసారధి

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: నూజివీడు పురపాలక సంఘం ఎక్స్ అఫిషియో సభ్యులుగా గురువారం స్థానిక పురపాలక సంఘం సమావేశమందిరంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా మున్సిపల్ సిబ్బంది వేదమంత్రాలతో పూల మాలలతో దుశ్శాలువతో మంత్రిని సత్కరించి స్వాగతం పలికారు. తదనంతరం మున్సిపల్ కమిషనర్ ఆర్, వెంకటరామిరెడ్డి మంత్రితో ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆర్.త్రివేణి దుర్గ, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గంలో త్రాగునీటికి ప్రాధాన్యత

విశాలాంధ్ర - నిడమర్రు: ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రజలకు తాగునీరు ఇబ్బందులు లేకుండా పరిష్కరిస్తా మని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం నిడమర్రు గ్రామ మంచి నీటి చెరువులో చెత్త పేరుకుపోయి నీరు కలుషితం కావటంతో ఎమ్మెల్యే ధర్మరాజు ఆదేశాల మేరకు గురువారం మంచి నీటి చెరువును శుభ్రం చేస్తున్న నేపథ్యంలో దగ్గర ఉండి ఎమ్మెల్యే ధర్మరాజు గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ధర్మరాజు సంబంధిత అధికారులతో మాట్లాడుతూ చెత్తను తొలగించి, నీటిని ఫిల్టర్ చేయించి గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు,గ్రామ జనసేన, టీడీపీ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఐ వినతి

విశాలాంధ్ర - వేలేరుపాడు : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన నష్టపోతున్న నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. సోమ వారం మండలా నికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి స్థాని కంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిర్వాసితుల ఇబ్బందులను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్ ఆధ్వర్యంలో తెలియజేశారు. నిర్వాసితు లకు అనేక ఏళ్లుగా న్యాయం చేస్తామని ప్రకటనలు చేయడమే కానీ గత ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు, అర్హులైన ప్రతి ఒక్కరికి పూర్తి ప్యాకేజీ ఇవ్వాలని, ముంపుకు గురవుతున్న కుటుంబాల పరిస్థితి క్షేత్రస్థాయిలో పూర్తిగా తెలుసుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి కారం ధారయ, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్, మండల కార్యదర్శి బాడిస రాము, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అగ్రవర్ణాలకే అగ్రస్థానం

విశాలాంధ్ర-చాట్రాయి: నిరుపేద దళిత బడుగు బలహీన వర్గాల వారి జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపడానికి తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పెంపు పథకాన్ని ప్రారంభిస్తే దానిని కూడా చీపురు గూడెంలో అగ్రవర్ణ భూస్వామ్య కుటుంబానికి చెందిన మాజీ సర్పంచ్ బొట్టు సూర్య నారాయణకు తొలి పెన్షన్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. జూలై ఒకటో తేదీన ప్రభుత్వం పండుగ వాతావరణంలో పంచిపెట్టిన పెన్షన్లు నిరుపేదల ఇంటి ముంగిటకు కాకుండా మేళతాళాలతో ధనవంతులకే కట్టబెట్టారని పలువురు అంటున్నారు. చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామంలో మాజీ సర్పంచ్ బొట్టు సూర్యనారాయణ చుట్టు పక్కల నాలుగు నియోజకవర్గాలలో రాజకీయంగా పేరు ఉన్న వ్యక్తి కావడం గమనార్హం. ఆర్థికంగా, సామాజికంగా అత్యున్నతమైన స్థానంలో ఉన్నవారు అగ్రవర్ణానికి చెందినవారు పింఛను తీసుకోవడం ఏమిటనేది చర్చనీయాంశమైంది.

అల్లూరి పోరాటపటిమ యువతకు ఆదర్శం కావాలి

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: అల్లూరి సీతారామరాజు విప్లవ స్ఫూర్తి, పోరాటపటిమ, దేశభక్తి నేటి యువతకు ఆదర్శం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా సీపీఐ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో గురువారం తణుకు వీరనారాయణ సెంటర్లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా భీమారావు, సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ సమాజంలో అణచివేతకు, దోపిడీకి గురవుతున్న గిరిజనుల పక్షాన వీరోచితంగా పోరాడిన యోధుడు అల్లూరి అన్నారు. దేశ సంపదను ముఖ్యంగా మన్యం ప్రాంతంలో గిరిజన సంపదను దోచుకుంటున్న బ్రిటిష్ వలస దోపిడీ పాలన అంతానికి దేశ స్వాతంత్ర్య సాధనకు పోరాడిన యోధుడు అల్లూరి అన్నారు. అమాయక గిరిజనులను సమీకరించి చైతన్యపరచి గెరిల్లా యుద్ధ పోరాటాలు నేర్పించి బ్రిటిష్ సైన్యాన్ని గడగడలాడించిన గొప్ప విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు.నేటి పాలకులు అల్లూరి విప్లవ పోరాట స్ఫూర్తిని కొనియాడుతూ అల్లూరి ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు.అరకు లాంటి గిరిజన మన్యం ప్రాంతాల్లో గ్రానైట్ తవ్వకాలు చేస్తూ అటవీ ప్రాంతాలను విధ్వంసం చేస్తూ గిరిజనులు జీవించే హక్కు కోల్పోయే రీతిలో పాలన సాగిస్తున్నారన్నారు.అల్లూరి ఆశయాలకు విరుద్ధంగా పాలన సాగిస్తున్న వీరికి అల్లూరిని స్మరించే నైతిక అర్హత లేదన్నారు. సీపీఐ తణుకు పట్టణ నాయకులు గుబ్బల వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ, పుట్టా అమ్మిరాజు, బొద్దాని మురళి కృష్ణ,బొద్దాని కృష్ణ కిషోర్, నూనె రాధాకృష్ణ, ఎన్.సుబ్బారావు తదితరులు అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కామవరపుకోటలో : మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 127వ జయంతి గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ముందుగా అల్లూరి చిత్రపటానికి సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు పూలమాలవేసి నివాళులర్పించారు. వర్తకం పేరుతో భారత దేశంలో అడుగుపెట్టిన బ్రిటిష్ ముష్కరులు దేశ సంపదను కొల్లగొట్టుకుపోవడంతో పాటు భారతీయులను కట్టు బానిసలుగా చూస్తున్న సమయంలో నాడు దేశ స్వాతంత్ర పోరాటం కోసం బహుముఖ మార్గాలలో పోరాటం చేస్తున్న నేపథ్యాన్ని గమనించిన అల్లూరి సీతారామరాజు గోదావరి పరివాహక ప్రాంతంలో గల గిరిజనులతో వెట్టి చాకిరి చేయించుకుంటూ వారికి కనీస గిట్టుబాటు కూలి ఇవ్వకుండా హింసిస్తున్న తెల్లదొరల అకృత్యాలను తెలుసుకుని గిరిజన ప్రాంతాల్లో ప్రవేశించి గిరిజనులకు రాత్రి పాఠశాలలు ఏర్పాటు చేసి వారిని కనీస విద్యావంతులు చేసి స్వాతంత్ర స్ఫూర్తిని రగిలించారని కొనియాడారు. నేటి యువజన విద్యార్థులు అల్లూరి ఆశయాలను కొనసాగించడం ద్వారా ఆయనకు మనమంతా నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామన్నారు. గ్రంథాలయాధికారి ఎం. భీమరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల బీడీసీ ఎల్ సుకన్య, విద్యార్థులు, సువర్ణ జోషిని సోమంత్ లైబ్రరీ అసిస్టెంట్ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో : విప్లవ పోరాట యోధుడు, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని ఆయన పోరాటాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సీతారాం ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు, రచయిత వేల్పుల నాగేశ్వరరావు, అల్లూరి విగ్రహ దాత రుద్రరాజు సూర్యనారాయణ రాజు అన్నారు. అల్లూరి 127 వ జయంతిని భీమవరం రూరల్ మండలం కొత్త పూసలమరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ మన్యంలో గిరిజనుల పై బ్రిటిష్ సామ్రాజ్యవాదులు జరుపుతున్న దాడులు అకృత్యాలను స్వయంగా చూసిన అల్లూరి మన్యం ప్రజల తరపున చేసిన పోరాట ఉద్యమం చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న పాలకులపై సమరశీల పోరాటాలు సాగించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి నాయకుడు తిరుమానికామేశ్వరరావు, సిపిఐ నాయకులు వాటాల రాధాకృష్ణ ,తెలుగుదేశం పార్టీ మండల నాయకులు జిల్లా వెంకటేశ్వర రావు, బస్వాని వెంకటేశ్వరరావు, బస్వాని వెంకటరమణ గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

క్షత్రియ యూత్ అధ్వర్యంలో: క్షత్రియ యూత్ వింగ్ అధ్వర్యంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాశ్వత అంగవైకల్యం పొందిన బండారు సుబ్బారావు ,చెరుకువాడ శివ నాగ సాయి కుమార్ లకు రు. 20,232 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఇందుకూరి రామలింగరాజు, పోత్తూరు బాపిరాజు, అల్లూరి సుబ్రహ్మణ్యం రాజు, వేగేసిన రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో : గిరిజన పేద ప్రజల కోసం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నిరంతర పోరాటాలు కొనసాగించి గిరిజనుల ఆరాధ్య దేవుడిగా పేరు ప్రఖ్యాతలు సాధించుకున్నాడని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కొయ్యలగూడెం పట్టణంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద సీపీఐ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు, ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెలగల దుర్గారావు, ఇళ్ల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకంలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

విశాలాంధ్ర-లింగపాలెం: ఉపాధి పథకంలో మెట్టప్రాంతమైన లింగ పాలెం మండలంలో ఈ ఏడాది 252 ఎకరాలలో ఉద్యాన పంటలు వేయటం మొదలైందని ఈ పథకం ఏపీవో వరలక్ష్మి వెల్లడించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తోటలు వేస్తున్నట్లు తెలిపారు. దాదాపు రూ1.13 కోట్లు ఖర్చుతో పామాయిల్,కొబ్బరి, జామ, మామిడి మొక్కలు పెంచుతున్నట్లు వివరించారు. మండలంలో 132 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఉద్యాన తోటలు పెంచుకునేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. ఉద్యాన పంటలు లాభదాయకంగా ఉండటంతో మెట్ట ప్రాంతంలో వీటిని పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని అన్నారు. వీటిని పెంచేందుకు అయ్యే ఖర్చును ఉపాధి నిధుల నుంచి లబ్ధిదారులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జరిగిన ఉపాధి పనులలో రూ.13 కోట్లకు పైగా ఉపాధి కూలీలకు వేతనంగా చెల్లించామని అన్నారు. ఇప్పటివరకు 5లక్షల 47 వేలపని దినాలు జరిగాయని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన అవుట్ సోర్సింగ్ సిబ్బంది



విశాలాంధ్ర-నరసాపురం :మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ను కలిసి తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన స్టాఫ్ డయేరియా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేను అవుట్ సోర్సింగ్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా సేవలందిస్తున్నామని, తమ ఉద్యోగాలకు భద్రత లేదని వివరించారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయడానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పర్మినెంట్ చేయలేని పక్షంలో జీతాలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని వాపోయారు. దీనికి సమాధానం గా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ మీ సేవలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. రాష్ట్రం అన్ని విధాలుగా అప్పుల ఊబిలో కూరుకు పోయిందని అన్ని శాఖలలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది దొమ్మ వరలక్ష్మి, గంధం ప్రసాద్, బత్తుల వెంకట రమణ, కోటిపల్లి కాశీ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

భార్య భర్తలపై హత్యాయత్నం



విశాలాంధ్ర -ముదినేపల్లి : మురుగునీరు ఇళ్ల మధ్యన వస్తుందన్న విషయంపై ఇరు కుటుం బాల మధ్య నెలకొన్న వివా దం ఘర్షణకు దారితీసి మరణాయుధాలతో దాడి చేయగా రక్తస్రావంతో భార్య భర్తలు తీవ్రంగా గాయ పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిగురుకోట గ్రామానికి చెందిన పరసా బాలాజీ ఇంటికి ప్రక్కన తుమ్మ సురేష్ ఇళ్ల మధ్య తుమ్మ సురేష్ వాడుతున్న మురుగునీరు నడకదారిలో వస్తున్నాయన్న సమస్యపై గ్రామ పెద్దలతో పంచాయతీ నడిచింది. ఈ క్రమంలో సమస్య పునరావృతం కావడంతో సురేష్ అతని భార్య అనిత కత్తులతో పరసా బాలాజీ, భార్య దేవిలపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాలాజీ, దేవీలను ఎస్ఐ డి.వెంకట్ కుమార్ 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరి ఆరోగ్య పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి పూర్వ వైభవానికి కృషి

మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర- నూజివీడు :ఉద్యానవన పంటలను సమతుల్యం చేసుకుంటూ నూజివీడు మామిడిని అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులకు, రైతులకు సూచించారు. నూజి వీడులో మామిడి మార్కెట్ ఏర్పాటు, మామిడి పంట అభివృద్ధిపై గురువారం నూజివీడు మార్కెట్ యార్డు ఆవరణలో మంత్రి సారధి అధికారులు, వ్యాపారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎంతో ప్రఖ్యాతిగాంచిన నూజివీడు మామిడి తన ప్రాచుర్యాన్ని కోల్పోవడానికి ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు కూడా కారణమన్నారు. మామిడి అభివృద్ధికి బాధ్యత వహించకుండా గాలికి వదిలేసారని పేర్కొన్నారు. రైతులకు కావాల్సింది ప్రభుత్వ సహకారం అని, ఆ సహకారాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని తమ ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నూజివీడులోని పండ్ల శుద్ధి కేంద్రాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టులను తొలగించి దాన్ని ఏ విధంగా అందుబాటులోకి తేవాలో అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పలువురు రైతులు మామిడి సాగు, నాణ్యత, మార్కెటింగ్ లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సారధి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను సారధి మామిడి పూర్వ వైభవానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నూజివీడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, హార్టికల్చర్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, నూజివీడు మామిడిపరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజ్యలక్ష్మి, పలు శాఖల అధికారులు, నున్న మామిడి మార్కెట్ యార్డ్ వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

కూటమి నేతలు ప్రత్యేక హోదాకై కృషి చేయాలి

విశాలాంధ్ర-చింతలపూడి: రాష్ట్రానికి ప్రత్యేక హోదాకై కూటమినేతలు ప్రయత్నించాలని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అన్నారు. రేచర్ల గ్రామ శాఖ సమావేశం దొంత తిరుపతయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కంచర్ల గురవయ్య మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పక్షాలైన టిడిపి జనసేన ఈ రాష్ట్ర అభివృద్ధికై రాష్ట్రానికి ప్రత్యేక హోదా, అమరావతి నిర్మాణానికి నిధులు, పోలవరం నిర్మాణానికి నిధులు తీసుకురావడానికి ప్రయత్నించాలన్నారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ప్రయత్నించాలన్నారు. రేచర్ల గ్రామంలో ప్రధాన రహదారులను అభివృద్ధి పరచాలని గ్రామంలో ఉన్న స్మశాన వాటిక రెవిన్యూ లెక్కల్లో లేదని దానిని రెవెన్యూ లెక్కల్లో ఎక్కించాలని పేర్కొన్నారు. దీనికోసం గ్రామంలో ఉన్న ప్రజలతో సంతకాల సేకరణ చేసి గ్రామ కార్యదర్శి మండల అధికారులకు జిల్లా అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ, మండల సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, గ్రామ కార్యదర్శి ఇస్తరాకులు వెంకటేశ్వరరావు, పాలదాసు చెంచయ్య, గుండ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ అభినందనీయం

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 8వ తేదీ నుండి ఇసుక ఉచిత పాలసీని ప్రవేశపెట్టడం చాలా ఆనందదాయకం అని తణుకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కొక్కిరమెట్టి సత్తిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఉచిత ఇసుక పాలసీని ఈ నెల 8 వ తేదీ నుండి అందించే ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా సంక్షేమ బోర్డును త్వరితగతిన ఏర్పాటు చేసి పెండింగ్ లో ఉన్న 42 వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలని ఆకాంక్షించారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

విశాలాంధ్ర -భీమవరం: కేంద్ర ప్రభుత్వం నీట్ అవకతవకలపై తక్షణమే దర్యాప్తు నిర్వహించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, నీట్ పరీక్షలను రద్దుచేసి మరలా పరీక్ష నిర్వహించాలని దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి పి.నాగరాజు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్ లో భాగంగా జిల్లాలో ఏ ఐ ఎస్ ఎఫ్, ఎస్ ఎఫ్ఐ, పిడియస్‌యు తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన కేజీ టు పీజీ విద్యా సంస్థల బంద్ భీమవరంలో విజయవంతం అయ్యింది. విద్యార్థి నాయకులు పలు ప్రైవేట్ ,కార్పొరేట్, ప్రభుత్వ విద్యా సంస్థలను మూయించి వేశారు. అనంతరం ప్రకాశం చౌక్ వద్ద నాయకులు ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమం కొనసాగిస్తా మన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు నాయకులు సాయి దుర్గా ప్రసాద్, ఎ.జగదీష్ , ఎ. లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

తణుకులో : నీట్ పరీక్షను రద్దుచేసి మరలా నిర్వహించాలని , నీట్ పేపరు లీకేజీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం దేశవ్యాప్త వామపక్ష విద్యార్థి సంఘాల బందులో భాగంగా తణుకులో జరిగిన విద్యా సంస్థల బంద్ జయప్రదమైందని ఏఐఎస్ఎఫ్ తణుకు నియోజకవర్గ అధ్యక్షులు గంటా పవన్, ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు కె. అనిల్ తెలిపారు. ఈ మేరకు గురు వారం తణుకు ఏరియాలో పలు ప్రైవేట్, కార్పొరేట్ ,ప్రభుత్వ విద్యా సంస్థలను ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మూయించి వేశారు.ఈ క్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు గంట పవన్‌ను పట్టణ పోలీస్ స్టేషన్‌లో కొంత సమయం నిర్బంధించారు. గంటా పవన్ , అనిల్ మాట్లాడుతూ నీట్ పరీక్షలు మరలా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతిభ ఉన్న లక్షలాదిమంది విద్యార్థులు పేపరు లీకు అవడం వలన తీవ్రంగా నష్టపోయారని ఇదే క్రమంలో రిజర్వేషన్ కేటగిరి విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని వారు ధ్వజమెత్తారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ నాయకులు పి. కుమార్, కే భాష , పి. రాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో : నీట్ పరీక్షా పేపర్ లీక్ పై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీ నామా చేయాలని, రాష్ట్రాల పరిధిలోనే నీట్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు నాయ కులు బంద్ చేపట్టారు. నియోజక వర్గంలో పోడూరు, పాలకొల్లు, యలమంచిలి, పాలకొల్లు రూరల్ ప్రాంతాలలో విజయవంతంగా జరిగింది. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుందర్ మాట్లాడుతు నీట్ పరీక్ష దేశ చరిత్రలో ఏనాడు కని విని ఎరుగని రీతిలో ఈసంవత్సరం అవకతవకలు జరిగాయని అన్నారు. ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి పులపర్తి కుమార్ మాట్లాడుతూ నీట్ పరీక్ష పత్రాల లీకులకు కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఏ)ను రద్దు చేయాలని, పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ శేఖర్ మాట్లాడుతూ "జాతీయ పరీక్ష నిర్వహణ సంస్థ" ను రద్దు చేసి తక్షణమే ఆయా రాష్ట్రాలకు పరీక్ష నిర్వహణ ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్ల నాయకులు పట్టణ కార్యదర్శి యలమల సంతోష్, అధ్యక్షులు యామిని తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతకు ఆదర్శం అల్లూరి సీతారామరాజు

విశాలాంధ్ర-ఏలూరు : దేశ స్వాతంత్య సంగ్రామంలో సాయుధ పోరాటం చేసిన అల్లూరి సీతారామ రాజు నేటి యువతకు ఆదర్శనీయుడని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి అన్నారు. అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలు స్థానిక కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ బ్రిటీష్ వారి నిరంకుశ పాలనకు మన్యం అటవీ ప్రాంతంలో బ్రిటీష్ ప్రభుత్వంపై గిరిజనులు చెయిన్స్ తిరుగు బాటుకు అల్లూరి నాయకత్వం వహించారని, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి దేశ ప్రజల్లో స్వాతంత్య కాంక్షను రగిలించారన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, ఆర్డీఓ ఎన్ .ఎస్.కె. ఖాజావలి, ఎస్డిసి భాస్కర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె. కాశీవిశ్వేశ్వర రావు, జిల్లా పర్యాటకాభివృద్ధి అధికారి పట్టాభిరామయ్య, కలెక్టరేట్ సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలు

విశాలాంధ్ర-ఏలూరు : పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో గురువారం మహిళలపై లైంగిక వేధింపులు నిరోధానికి తీసుకోవలసిన చర్యలపై మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణలో భాగంగా పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించడానికి 2013వ సంవత్సరంలో ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. చట్టం అమలులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ మహిళలపై లైంగిక వేధింపులు నిరోధక కమిటీలు నలుగురు సభ్యులతో ఏర్పాటుచేయాలని, వారిలో కనీసం ఇద్దరు మహిళలను కూడా సభ్యులుగా నియమించాలన్నారు. అదనపు ఎస్పీ స్వరూపరాణి మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు జరిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. నేరం రుజువైతే సంఘటన తీవ్రత ననుసరించి జరిమానా, జైలు శిక్ష లేదా నిందితుడిని ఉద్యోగంలోనుండి కూడా తొలగించవచ్చన్నారు. రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్ కూన కృష్ణారావు మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులపై భారతీయ శిక్షాస్మృతి లో చట్టాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ కె. సుబ్బారావు, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఆర్డీఓ ఎన్ .ఎస్.కె. ఖాజావలి,డి ఆర్ డి ఏ పీడీ ఆర్. విజయ రాజు, సాంఘిక సంక్షేమ శాఖ జెడి ప్రకాశరావు, జిల్లా బి.సి., సంక్షేమ శాఖాధికారి నాగరాణి, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, జిల్లా విద్యా శాఖాధికారి అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SODADASI MANIKYALA RAO, S/o SODADASI CHITTI JAMES, Resident Address 1- 81, Pedapeta, Jonnalagaruvu, Veeravasaram Mandal, W.G. Dist, AP, 534207, I Have Changed My Name From **SODADASI MANIKYA RAO (Old Name)** To **SODADASI MANIKYALA RAO (New Name)**. Hence After All My Documents And Correspondence Will Be Continue With My New Name **SODADASI MANIKYALA RAO**.

దివ్యాంగులకు వితరణ

విశాలాంధ్ర-భీమడోలు: దివ్యాంగులలో అపరిమితమైన స్వాభావిక ప్రతిభ ఉంటుందని, ఆ ప్రతిభను పెంపొందించుకోవడంతో పాటు వికాసానికి వేదిక కావాలని భీమడోలు సిఐ బీబీ రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం భీమడోలు మండలం గుండుగోలను గ్రామంలోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన దాత మంతెన సూర్యనారాయణరాజు 60మంది దివ్యాంగులకు సన్నబియ్యం, పండ్లు, పోషకాహారం అందించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన దివంగత దాట్ల సూరపురాజు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె గ్రామంలోని శ్రీవిద్యాలయ పాఠశాలలో టెన్త్‌లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు నగదు, షీల్డ్‌లతో ప్రతిభాపురస్కారాలు అందించారు. ఈసందర్భంగా సిఐ రవికుమార్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐ సుధాకర్, జిల్లా దివ్యాంగుల పోరాట సమితి అధ్యక్షులు మామిడిపల్లి నాగభూషణం, శ్రీవిద్యాలయ కరస్పాండెంట్ గేదెల సురేష్, నిర్వాహకులు దాట్ల కృష్ణంరాజు, సీతారామరాజు, పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, అరసంకల సోములు, రావి గంగరాజు, కర్రి గంగాధరరావు సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రైండర్ అందజేత

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా మహిళా సంఘం ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా తాడేపల్లిగూడెం ఆర్యవైశ్య మహిళ సంఘం చేసిన సేవా కార్యక్రమాలకు మెచ్చి, స్టేట్ ప్రెసిడెంట్ నాళం ఆండాళ్ సేవా కార్యక్రమాల నిమిత్తం గ్రైండర్ను అందజేశారు. ఆ గ్రైండర్‌ను స్థానిక రామారావు పేటలోని ఒక పేద యువతి పావనికి వ్యాపార నిమిత్తం గ్రైండర్‌ను ఇచ్చారు. సేవా కార్యక్రమానికి సహకరించిన ఆండాళ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా మహిళా సంఘం ప్రెసిడెంట్ ఆలపాటి అచ్యుత లక్ష్మి, సెక్రటరీ నున్న శ్రీ నాగలక్ష్మి,పొన్నగంటి సత్య కోటేశ్వరి పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో సాగు భూసారం పెంపు

విశాలాంధ్ర-ముదినేపల్లి: పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూ సారాన్ని పెంపొందించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా అన్నారు. మండలంలోని ముదినేపల్లి, పెయ్యేరు, సింగరాయపాలెం,

పేరూరు, శ్రీహరిపురం గ్రామాల్లో వ్యవసాయశాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలను సమీక్షించారు. భూసారాన్ని పెంచి చౌడును తగ్గించుకునేందుకు 50 శాతం సబ్సిడీపై జిల్లా వ్యాప్తంగా 6367 క్వింటాళ్ల జీలుగ, 2566 క్వింటాళ్ల పిల్లిపెసర, 2655 క్వింటాళ్ల జనుము విత్తనాలు సరఫరా చేయగా రైతులు సాగు చేశారు. ఆ పొలాలను, మట్టి నమూనా సేకరణ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అదికారుల బృందం పరిశీలించింది. మండలంలో పలు విత్తనాలు , పురుగు మందుల షాపులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ జి. వెంకటమణి, ఏవో జి. వేణుమాధవ్, విఎఎలు,రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ పేదలకు విష్ణు కుమార్ రాజు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: గ్రామీణ పేదలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి శాసన సభ పక్షనేత విష్ణుకుమార్ రాజు వారికి క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సి పి ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె నిరీక్షణ రావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం వల్ల గ్రామీణ ప్రజలు సోమరిపోతుల్లా తయారయ్యారని,ఆ పథకాన్ని వెంటనే నిలుపుదల చేయాలని అనడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఉపాధి హామీ పథకం,రూపాయికి కిలో బియ్యం, ఇతర సరుకులు సబ్సిడీపై ఇవ్వడం, ఉచిత పథకాల వల్ల గ్రామీణ పేదల్లో బద్దకం పెరిగింది అనడం సరికాదని హితవు పలికారు. విష్ణు కుమార్ రాజు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే బిజెపి గ్రామీణ పేదల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ప్రజా నాయకుడు వంగవీటి రంగా

విశాలాంధ్ర-భీమడోలు: పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడిన వంగవీటి మోహనరంగా ప్రజానాయకుడు అని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం మండల కేంద్రమైన భీమడోలులో కాపుయువత ఆధ్వర్యంలో రంగా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మరాజు పాల్గొని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ స్వీట్లు, వృద్ధులకు పండ్లు పంచారు. కార్యక్రమంలో తొలుత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పేదల పెన్నిధిగా వంగవీటి రంగా జీవించారని, ఆయన సారూప్యత కలిగిన జనసేనాని పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పనిచేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే ధర్మరాజు హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో జనసేన పార్టీ భీమడోలు మండల అధ్యక్షులు ప్రత్తి మదన్, టీడీపీ మండల అధ్యక్షులు సిరిబత్తిన కొండబాబు, పుప్పాల శ్రీనివాసరావు, కరణం పెద్దిరాజు, వంగా రఘు, భీమడోలు కాపు యువత కార్యక్రమంలో పాల్గొన్నారు.



నరసాపురంలో : మండలంలోని చిట్టవరం గ్రామంలో గురువారం బడుగు బలహీనవర్గాల నాయకుడు కీ.శే. వంగవీటి మోహన్ రంగా 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఎమ్మెల్యే నాయకర్, వంగవీటి రాధా సతీమణి, రంగా కోడలు వంగవీటి పుష్పవల్లి జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీ కృష్ణ (చిన్నా) పాల్గొని వంగవీటి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిట్టవరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులను వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ వంగవీటి మోహన రంగాను యువత ఆదర్శవంతంగా తీసుకుని జీవించాలని పిలుపునిచ్చారు.బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం రంగా చేసిన కృషి ఎనలేదని కొనియాడారు. నియోజవర్గంలో మెయిన్ కూడలిలో రంగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే నాయకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలిన వంతెనకు మరమ్మతులు

విశాలాంధ్ర - కలిదిండి: పెద్ద కొమ్మిలేరుపై గతంలో నిర్మించిన వంతెన ఒక కాన కూలిపోవడంతో దాని నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. గురువారం మండలంలోని పోతుమర్రు తాడినాడ గ్రామాల మధ్య గల కొమ్ములేరు వంతెన కాన స్లాబ్ నిర్మాణానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన స్లాబ్ కూలిపోవడంతో రైతులు, విద్యార్థులు, వివిధ గ్రామాల నుంచి వంతెనపై వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన కూలిన కానా వంతెన నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

విశాలాంధ్ర-భీమడోలు: ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం భీమడోలు సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సందర్శించారు. ఈ మేరకు ఆసుపత్రిలో పలు విభాగాలను తనిఖీచేసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు అందుబాటులో ఉన్న సదుపాయాలను ఆసుపత్రి సూపరిండెంట్ సునీత ను ఎమ్మెల్యే ధర్మరాజు అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించి వారి అభిమానాన్ని చూరగోనాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో భాగంగా రోగులను పరామర్శించి స్థానిక కాపు యువత రంగా జయంతి సందర్భంగా సమాకూర్చిన పండ్లను రోగులకు అందించి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకుని వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈసందర్భంగా ఆసుపత్రి అవసరాలకు సంబంధించిన వినతిపత్రాన్ని సూపరింటెండెంట్ సునీత ఆసుపత్రి వైద్యులతో కలిసి ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు, కాపుయువత నాయకులు పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

విశాలాంధ్ర-భీమవరం: తాడేపల్లిగూడెంలో ఉన్న పురుగు మందుల పరీక్ష లాబొరేటరికి కావలసిన గ్యాస్ లిక్విడ్ క్రొమోటోగ్రఫీ మెషిన్ సరఫరా చేసేందుకు స్వల్ప కాలిక టెండర్లకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ లిక్విడ్ క్రొమోటోగ్రఫీ మెషిన్, దాని సాఫ్ట్ వేర్ తో కూడిన కంప్యూటర్ సరఫరా చేయుటకు ఆసక్తి గల ఉత్పత్తిదారులు, అధీకృత డీలర్ల షార్ట్ టెండర్లు ద్వారా మెషీన్ సరఫరా కొరకు టెండరులో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి గల బిడ్డర్లు ఇ.యం.డి మొత్తం రూ.2 లక్షలు జూలై 16వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపుగా డిమాండ్ డ్రాఫ్ట్ లేదా బ్యాంకర్స్ చెక్ ను సమర్పించాల్సి ఉందన్నారు. అదే రోజు సాయంత్రం 03:00 గంటలకు టెండర్లు తెరవబడతాయని, టెండరు డాక్యుమెంట్లను భీమవరం కలెక్టరేట్ కాంపౌండ్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉందన్నారు. టెండరు పొందిన నెల రోజుల లోపున మెషీన్ సరఫరా చేయవలసి ఉంటుందన్నారు. టెండరు షెడ్యూలు, సాంకేతిక అవసరాలు, ఇతర సమాచారానికి తాడేపల్లిగూడెం పురుగు మందుల పరీక్ష లాబొరేటరి సహాయ వ్యవసాయ సంచాలకుల వారి కార్యాలయం నుండి జూలై 8వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం 10:30 నుండి సాయంత్రం 05:00 గంటల మధ్య పొందవచ్చునని, ఏదైనా సందేహ నివృత్తికి ఈ సెల్ నెంబర్ నందు సంప్రదించాలని 8331056658 జిల్లా జాయింట్ కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

శాస్త్రీయ వైజ్ఞానికంలో ప్రోత్సాహం

విశాలాంధ్ర - కలిదిండి: విద్యార్థులలో శాస్త్రీయ వైజ్ఞానిక సృజనాత్మకత ప్రోత్సహించి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే ప్రధాన లక్ష్యంగా కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ చర్యలు చేపట్టిందని ఎంఈఓ పి. ప్రభాకర్ తెలిపారు. గురువారం మండలంలోని పెదపట్లపూడి ఎంపియుపి స్కూల్ నందు విద్యార్థులకు ఇన్స్పైర్ మనక్ అవార్డు గురించి విద్యార్థులకు వివరించారు. 2024-25 కు సంబంధించి ఆన్లైన్లో విద్యార్థుల నుండి నామినేషన్లు స్వీకరిస్తున్నారు అని అన్నారు. ఈనెల 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రతి పాఠశాల నుంచి గైడ్, టీచర్ తో కలిపి విద్యార్థుల పాల్గొనే అవకాశం ఉంటుందని విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్టు సామాన్య ప్రజలు అవసరాలు తీర్చిదిద్దే విధంగా ఉండాలి అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుండి 10 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పాల్గొనవచ్చు అన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల నుండి 3, ఉన్నత పాఠశాల నుండి 5 ప్రాజెక్టుల తమ ఆలోచనలు పంపించాలి తెలిపారు. ఉత్తమముగా ఎంపిక చేసిన వాటిని వెబ్సైట్లో నమోదు చేస్తారన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో సృజనాత్మకతను ప్రోత్సహించేం దుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో సరికొత్త ఆలోచనలతో విద్యార్థులు ముందుకు రావాలని తెలిపారు. శాస్త్రవేత్తలుగా రాణించేందుకు ఇది ఒక తొలి మెట్టు అని ఎంపికైన వారికి రూ. 10 వేలు నగదు ప్రోత్సాహం అందజేస్తారన్నారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తా

విశాలాంధ్ర- ఉంగుటూరు : వర్షాకాలంలో కురిసే వర్షం నీరు , ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు వలన ప్రతి ఏడాది ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం గొల్లగూడెం గ్రామంలో ఊర చెరువు గట్టుల పటిష్టత, చెరువుల వల్ల ముంపునకు గురైన డ్రైనేజిలపై ప్రక్షాళన చేపట్టిన పనులకు ఎమ్మెల్యే ధర్మరాజు కొబ్బరికాయ కొట్టి భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ వర్షాకాలంలో అధిక వర్షాల వల్ల వచ్చే వరదల కారణంగా ముంపునకు గురికాకుండా ఎప్పటికప్పుడు డ్రైనేజిల్లో తూడుని తొలగించాలని అధికారులను ఆదేశించారు. ముంపుకు గురైన ప్రాంతాన్ని, ఊర చెరువును పరిశీలించారు. అనంతరం ఆయన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాతూరి విజయ్ కుమార్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు పంది రాంబాబు, జనసేన, టీడీపీ,బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - వేలేరుపాడు : గోదావరి వరదల వలన ముంపు గ్రామాల కుటుంబాలకు ఏ విధంగా నష్టం కలగకుండా అప్రమ త్తంగా ఉండాలని స్థానిక ఎంఎల్ఏ చిర్రి బాలరాజు అధికారులను ఆదేశించారు. ఎంఎల్ఏగా గెలిచిన తరువాత మొదటసారి గురువారం ఆయన మండలంలో పర్యటించారు. వెలుగు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఏడాది గోదావరి వరదల వలన స్థానికులకు అనేక విధాలుగా నష్టం చేకూరుతుందన్నారు. గత అనుభవంతో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వరద సంభవిస్తే ముంపు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిం చేందుకు తగు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి పలు కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. మంచినీటి వసతి అన్ని గ్రామాల్లో సక్రమంగా ఉండాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా చేపట్టాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పోలవరం నిర్వాసితుల న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకొని వారి నుండి వినతి పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జనసేన, టీడీపి, బీజేపీ నాయకులు గణేశుల ఆదినారా యణ, అమరవరపు అశోక్, ములకలపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పురాణం వద్దు... పని ఎందుకు జరగలేదోచెప్పండి?

మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర- చాట్రాయి : సొల్లు పురాణం వద్దు..... పని ఎందుకు జరగలేదు చెప్పండి....? మీకున్న సమస్య ఏంటి...? ఎందుకంత నిర్లక్ష్యం....? వాటర్ ట్యాంకు నిచ్చెన మెట్లు లేవు.... ఎన్ని సంవత్సరాలవు తోంది... వాటర్ క్లోరినేషన్ జరగక? ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు...? అంటూ మంత్రి కొలుసు పార్థసారథి పంచాయతీ అధికారులపై ప్రశ్నలు వర్షం కురిపించారు. గురువారం చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామంలో మెడికల్ క్యాంపును మంత్రి పార్థసారథి సందర్శించారు. గ్రామంలో నడుచుకుంటూ వాటర్ ట్యాంకు స్థానికంగా ఉన్న పరిస్థితులు మురికి నీగొనా ప్రత్యక్షంగా చూశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ శర్మిష్టాను జ్వరాల సమస్యకు కారణాలను అడిగి తెలుసుకున్నారు.

వాటర్ ట్యాంక్ అతిపెద్ద సమస్య : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శర్మిష్టా మాట్లాడుతూ వాటర్ ట్యాంకు క్లోరినేషన్ సుదీర్ఘకాలంగా జరిగినట్టు కనబడటం లేదని, వాటర్ ట్యాంక్ పైపులు లీకేజీ వర్షపు నీరు డ్రైనేజీలో నిల్వవున్న మురికి నీరు పైపులైన్లలో కలవడం వలన నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురైనట్టు మంత్రికి వివరించారు. వాటర్ ట్యాంక్ వద్ద ఫిల్టర్ బెడ్ లేనేలేదు అన్నారు.

ఇల్లిల్లూ సర్వే : మండల వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ చీపురుగూడెం గ్రామంలో ఆరోగ్య శాఖ సిబ్బంది 10 బృందాలు 30 మంది 574 ఇళ్లలో 1886 మందిని సర్వే చేయగా ఏడుగురికి జ్వరాలు రాగా నలుగురికి 102 వరకు జ్వరం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వైద్య శిబిరం కి వచ్చిన వారికి మందులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారిణి మంగ కుమారి, డివిజనల్ పంచాయతీ అధికారి ఇందిర, డివిజనల్ వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన మామిడి దిగుబడికి సహకరించండి

మంత్రి సారధితో రైతులు

విశాలాంధ్ర -నూజివీడు : నాణ్యమైన మామిడి దిగుబడులు సాధించడంతోపాటు గిట్టుబాటు ధరలు లభించేలా రైతులకు సరైన సూచనలు, సలహాలు అందించడంలో ఉద్యానవన వ్యవసాయ మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని గురువారం నూజివీడులో జరిగిన మామిడి రైతుల సమావేశంలో రైతులు రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువచ్చారు. మామిడి పంటకు సంబంధించిన వివిధ సమస్యలపై సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీటిలో మామిడి కాయకు గతంలో ప్రభుత్వం ఫ్రూట్స్ కవర్ లు రైతులకు సప్లై చేసేదని అది తిరిగి పునరుద్ధరించాలని, మార్కెట్ లో మామిడికి ఉపయోగించే క్రిమిసంహారిక మందులు నకిలీవి వస్తున్నాయని దీనిని అరికట్టడంతో పాటు నాణ్యమైన క్రిమి సంహారిక మందులు సప్లై చేయాలని కోరారు.చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని అభివృద్ధి చేసి మామిడి రైతులను ఆదుకోవాలని, జాతీయ ఉపాధిహామీ పనుల పథకాన్ని రైతులకు అనుసంధానం చేయాలని కోరారు. నూజివిడులో మామిడి మార్కెట్ యార్డు లేక రైతాంగం నష్టపోతుందని మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని, రైతులకు మామిడి పంటకు భీమా సౌకర్యం కల్పించాలని మామిడి పరిశోధనా కేంద్రం వల్ల మామిడి రైతులకు ఎటువంటి సాకారం అందడం లేదని, రైతులకు మామిడి పంటపై పూర్తిస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవనాలు శాఖాధికారి ఎస్. రామ్మోహన్, ఏపి ఎంఐపి ప్రాజెక్ట్ అధికారి పి. రవికుమార్, శాస్త్రవేత్త డా.కనకమహాలక్ష్మి, మార్కెట్ యార్డ్ కార్యదర్శి శ్రీనివాస్, రైతులు, వ్యాపారులు, మామిడి ప్రాసెసింగ్ యూనిట్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభృతులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమస్యల పరిష్కారం కోరుతూ కేంద్ర మంత్రులకు వినతి పత్రాలు

విశాలాంధ్ర-ఏలూరు: న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2 రోజుల పర్యటనలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుతో కలిసి, ఏలురు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్, సహచర పార్లమెంట్ సభ్యులు,కేంద్ర పౌర విమానశాఖ మంత్రి వర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి కేంద్ర మంత్రులు అమిత్ షా, పియూష్ గోయల్, శివరాజ్ సింఘ్ చౌహన్, నీతి ఆయోగ్ చైర్మన్ ప్రమోద్ కుమార్ మిశ్రను మర్యాద పూర్వకంగా కలిసి సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విభజన హామీల సమస్యలను పరిష్కరించాలని అంధ్రరాష్ట్ర అభివృద్ధి, అమరావతి రాజధాని అభివృద్ధి పనులకు రాబోయే కేంద్ర బడ్జెట్ సమావేశాలలో రాష్ట్రానికి నిధులు కేటాయించాలని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తో సమావేశమై ఆంధ్రప్రదేశ్ లోని పెండింగ్ లో ఉన్న జాతీయ రహదారుల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చెయ్యాలని, పెండింగ్ లో ఉన్న హైవే ప్రాజెక్టులు అనంతపురం నుండి అమరావతి వరకు, హైదరాబాద్ నుండి అమరావతి వరకు ఉన్న రహదారులను పూర్తి చేయాలని వినతిపత్రాలు సమర్పించి చర్చించారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, వెంటనే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు

విశాలాంధ్ర -ఏలూరు: స్థానిక కస్తూరిబా నగర పాలక బాలికోన్నత పాఠశాల ఆవరణలో ప్రధాన ఉపాధ్యాయురాలు జి.సునీత అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్. ఆర్ మాస్టారు, మానవతా అధ్యక్షులు అజయ్ బాబు, సామాజిక వేత్త గొంతిన రామకృష్ణ,సోషల్ సర్వీస్ సోమలా నాయక్, కస్తూరి రావు ముఖ్య అతిథులుగా పాల్గొని రామరాజు చిత్రపటానికి పూలమాలలు ఆవిష్కరించారు. అజయ్ బాబు మాట్లాడుతూ మన్యం విప్లవ వీరుడు, అలుపెరగని పోరాట యోధుడు శ్రీఅల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు వివరించారు. బాలికలు అల్లూరి సీతారామరాజు వేషధారణలో అలరించారు, దేశభక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టి నరసాపురంలో : నేటి యువత అల్లూరి సీతారామరాజు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని టి నరసాపురం సొసైటీ మాజీ చైర్ పర్సన్ దేవరపల్లి ముత్తయ్య తెలిపారు. స్థానిక బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు బంజారా బజరంగీ భేరి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతా రామరాజు దేశ స్వాతంత్ర్యం కోసం మన్యం ప్రజలను సమీకరించి బ్రిటీషు వారిపై అలుపెరగని పోరాటం చేసారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా బిగినాదం నాయక్, జరభల చందా నాయక్, చిన్నం భీమయ్య, నాగనబోయిన వెంకటేశ్వరావు, జోనుబోయిన శ్రీనివాసరావు, సాయల సత్యనారాయణ, జోనుబోయిన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో : మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 127 వ జయంతి సందర్భంగా సీతారామ రాజు చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు అతి చిన్న వయసులోనే స్వతంత్రం కోసం బ్రిటిష్ సామ్రాజ్యంపై దండెత్తిన మన్యం వీరుడని అన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని అవినీతిపై పోరాడాలన్నారు ఇటువంటి వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని నివాళులర్పించడం ద్వారా వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మున్సిపల్ చైర్ పర్సన్ వెంకటరమణ జయరాజు,ఆర్ ఐ నానాజీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో : మన్యం ప్రజల కష్టాలను చూసి చలించిపోయిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు జయంతిని ప్రభుత్వం తరఫున నిర్వహించారు. తొలుత సీతారామ రాజు విగ్రహానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి నేత వలవల బాబ్జీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అటువంటి వ్యక్తి జయంతిని ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా ప్రభుత్వ పరంగా నిర్వహించడం పట్ల సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన మృతి చెంది 103 ఏళ్ళు గడిచినప్పటికీ స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీ మాట్లాడుతూ భారతదేశ చరిత్ర పుటల్లో అల్లూరి సీతారామరాజు పేరు నిలిచిపోతుందన్నారు. బీజేపీ నేత ఈతకోట తాతాజీ మాట్లాడుతూ భీమవరంలో 125 జయంతి సందర్భంగా నాడు భీమవరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వపరంగా అల్లూరి జయంతిని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. మురళీకృష్ణ, క్షత్రియ సేవా సమితి ప్రతినిధి సిహెచ్ ఏ ఆర్ కే వర్మ, పేరిచర్ల మురళీ, ఉమ్మడి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపవరంలో : గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ల 1,2 ఆధ్వర్యంలో, అగ్గిపిడుగు, విప్లవ వీరుడు,మన్యం దొర అల్లూరి సీతా సీతారామరాజు 112 జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అధ్యక్షత వహించి మాట్లాడుతూ గిరిజన ప్రజలకు, కొండ ప్రాంతాల్లో నివసించే వారికి ఆయన చేసిన సేవలను వివరించారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా అయన చేసిన విప్లవం, పోలీస్ స్టేషన్ లపై వారు చేసిన దాడులను విద్యార్థులకు వివరించారు. తరువాత కళాశాల ఆవరణలో ఉండే అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు సమర్పించి,అంజలి ఘటించారు.దీనిలో భాగంగా వ్యాస రచన, క్విజ్, వకృత్వపు పోటీలలో గెలుపొందిన వారికి బహుమతుల్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సిహెచ్. చైతన్య డాక్టర్, టి అక్కిరాజు డాక్టర్ కె స్వరూప రాణి, ఎన్ వి ఎన్ బి శ్రీనివాసరావు, , డాక్టర్ జి వెంకటరమణ, షేక్ పర్వీన్, మోయినన్సారి, పి. భాస్కరరావు,అధ్యాపకేతర బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండిలో : స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో సీతారామరాజు చిత్రపటానికి గ్రంథాలయ అధికారి రమేష్, సాహితీమిత్రులు చక్కా జగన్ మోహనరావు, హైస్కులు విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా చక్కా జగన్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర పోరాటం దేశ చరిత్రలో ఒక మరుపురాని ఘట్టమన్నారు. మన్యంలో ఉన్న అడవి బిడ్డలను మన్యంపోరాటంలో భాగస్వామ్యం చేసి బ్రిటీష్ వారిని గడగడలాడించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాజరైన హైస్కూల్ విద్యార్థులతో గ్రంథాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పై వ్యాసరచన పోటీ పెట్టారు. ఈ కార్యక్రమంలో అటెండర్ పురుషోత్తం పాల్గొన్నారు.

పెంటపాడులో : మండలంలోని ఉమామహేశ్వరం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద అల్లూరి సీతారామరాజు 127 వ జయంతి ని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఖండవల్లి బేబీ సుధ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ ఉమ్మడి పార్టీల నాయకులు విచ్చేసి అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి పూలమాలవేసి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు అనగానే ముందుగా గుర్తుకొచ్చేది మన్యం వీరుడు అని, బ్రిటిష్ వారికి ఎదురు నిలిచి పోరాడిన విప్లవ వీరుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర మహిళా మాజీ కార్యదర్శి కొండ్రెడ్డి హైమావతి, గ్రామ సర్పంచ్ మద్దుకూరి నాగేశ్వరరావు,గ్రామ మాజీ సర్పంచ్ మద్దుకూరి రామకృష్ణ,జనసేన నాయకులు మర్రిపూడి సుబ్బారావు, మరిపూడి చిన్నమూతిన రాంబాబు, నల్లమాటి కృష్ణ , ప్రవీణ్, గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

పాలకోడేరులో : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127 వ జయంతి వేడుకలు ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణరాజు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు స్వగ్రామం పాలకోడేరు మండలం మొగల్లు గ్రామంలోఘనంగా నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని బ్రిటిష్ వారి పరిపాలన నుండి ప్రజలను విముక్తి చేయడానికి చిన్నవయసు లోనే ప్రాణార్పణ చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. అలాంటి దేశభక్తుడుఈ గ్రామంలో జన్మించి ఈ గ్రామాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసిన వ్యక్తి అన్నారు అతి చిన్న వయసులోనే బ్రిటిష్ అధికారుల గుండెల్లో పరుగులు పెట్టించిన ధైర్యశాలి అని, విప్లవానికి నాంది పలికి తన ప్రాణాలు సైతం అర్పించిన మహావీరుడని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మంతెన రామరాజు, ఉండి జనసేన పార్టీ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, పాలకోడేరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన, బిజెపి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వేణుకు పరామర్శ

విశాలాంధ్ర - పెదపూడి : మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ తల్లి ఇటీవల మృతి చెందగా గురువారం అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి రామచంద్రపురంలో పరామర్శించి ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం కుతుకులూరు కూటేశ్వరస్వామి కాలనీలో వైఎస్ఆర్సిపి నాయకులు ఆర్‌కె దుర్గా రెడ్డి కుమార్తె అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సబ్బెళ్ళ నాగిరెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి(పెద్దోడు), సబ్బెళ్ళ రామారెడ్డి తదితరులు ఉన్నారు.

రోగుల సేవలపై ఎంపీ ఆరా

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా కేంద్రం కాకినాడలో సాంబమూర్తి నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిని గురువారం కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సందర్శించారు. తొలుత ఆయన ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశమై రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కె శ్రీనివాసరావుతో కలిసి ఆసుపత్రిలో మెడికల్ వార్డులు, వైద్యుల ఛాంబర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం 100 కోట్లు పైనే వెచ్చించి కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా అత్యాధునిక హంగులతో ఆసుపత్రిని నిర్మించడం జరిగిందన్నారు. అతి త్వరలో పూర్తిస్థాయి సేవలతో ఆసుపత్రి రానుందని, భవిష్యత్తులో ఆసుపత్రిలో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీ ఉదయ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెంట్ డా కె శ్రీనివాసరావు, డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ సమీర్ సౌరవ్ పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో ప్రత్యేక హోదా సాధించాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు పోరాట స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని హామీలను నేరవేర్చేందుకు కృషిచేయాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి పలు రాజకీయ పార్టీల నాయకులు విజ్ఞప్తి చేసారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక ఫౌండర్ ఎస్.దశరథరామిరెడ్డి, ప్రత్యేక హోదా జాయింట్ యాక్షన్ కమిటీ స్టేట్ కన్వీనర్ మర్రి రాజా శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం రూరల్ నుంచి జై భారత్ నేషనల్ పార్టీ తరపున పోటీచేసిన మన్నవ రఘురాం మాట్లాడారు. ముందుగా అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాడు సాయుధ పోరాటం అనివార్యమని భావించి మన్యంలో ఉండే గిరిజనుల సాయంతో రవికాంచని బ్రిటీష్ సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని అల్లూరి ముప్పతిప్పలు పెట్టారన్నారు. చివరికి ఆయనను మనవారే బ్రిటీషర్లకు పట్టించి కాల్చి చంపేయడానికి కారకులయ్యారన్నారు. ఆయన చేసిన పోరాటాన్ని నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి ప్రత్యేక హోదా సాధించాలని డిమాండ్ చేసారు. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన ఎంపీల అవసరం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నందున ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాలని కోరారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఎన్డీఏ కూటమిలో ఉంటూ అక్కడ అసెంబ్లీలో ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని తీర్మానం చేయించారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేకపోతే జాతీయ రహదారుల సంస్థకు చెల్లించే టోల్ ట్యాక్స్ కట్టవద్దని ప్రజలకు పిలుపునిస్తామని వెల్లడిరచారు. రాష్ట్రంలో అన్ని ప్రజా సంఘాలు, విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని ప్రత్యేక హోదా సాధనకై పోరాటం చేయడానికి సిద్ధమని ప్రకటించారు.

విద్యా సంస్థల బంద్ సంపూర్ణం

విశాలాంధ్ర - రాజోలు : నీట్ పరీక్షపత్రాలను లీక్ చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడి, విద్యార్థులను తీవ్రంగా నష్టపరచిన కేంద్ర విద్యాశాఖ మంత్రితో సహా, భాద్యులను శిక్షించాలని, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రయివేట్ విద్యా సంస్థల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను అరికట్టాలని, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని తదితర డిమాండ్లతో చేపట్టిన విద్యాసంస్థల బంద్ రాజోలు నియోజకవర్గంలో సంపూర్ణముగా జరిగింది. అన్ని ప్రభుత్వ ప్రయివేట్ విద్యాసంస్థలు బంద్‌తో మూతపడ్డాయి. ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాల నాయకులు మారుమూల ప్రాంతాలలో సైతం స్కూళ్లను మూయించివేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్ చేసిన దోషులను శిక్షించాలని, విద్యార్థులకు నష్టపరిహారం ఇవ్వాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ బంద్‌కు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు దేవ రాజేంద్ర ప్రసాద్, నక్కా సంజయ్, ఎస్ఎఫ్ఐ నాయకులు తాడి రవీంద్ర, చందు, తాడి సహాదేవ్, మణికంఠ, రషీద్, రోహిత్, సుప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి ఆశయాలు ఆచరిద్దాం : ఎంపీడీవో

విశాలాంధ్ర - కరప : అల్లూరి ఆశయాలను యువత ఆచరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె అప్పారావు పేర్కొన్నారు. మండల కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా కార్యాలయం సిబ్బందితో జరుపుకున్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహాశీల్దార్ రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో అల్లూరు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అల్లూరి స్వాతంత్ర సమరయోధుడిగా బ్రిటిష్ వారిని గడగడ లాడించిన విప్లవ వీరుడు అల్లూరి అని కొనియాడారు. సూపర్డెంట్ భీమశంకరావు సిబ్బంది పాల్గొన్నారు. కరప గురజానపల్లి గ్రామం నందు జిల్లా అపరిషత్ హైస్కూల్లో ఉపాధ్యాయులు సీతారామరాజు జయంతిని హైస్కూల్ విద్యార్థులతో ఘనంగా నిర్వహించి అల్లూరు స్ఫూర్తిని విద్యార్థులు ఆచరణలో ఆచరించే విధంగా ముం దుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్ సాయి మోహన్, ప్రసాదరావు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలంలోని మూలస్థాన అగ్రహారం 216(ఏ)నెంబర్ గల జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన రేలంగి సూర్యనారాయణ(60) అనే వ్యక్తి అక్కడికి అక్కడే మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సూర్యనారాయణ పువ్వులు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటారని, ఎప్పటిలాగే జొన్నాడ గ్రామంలో తన పనిని ముగించుకుని సైకిల్ పై ఇంటికి తిరిగి వెళ్లే తరుణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుందని, రావులపాలెం వైపు నుండి రాజమహేంద్రవరం వైపుగా వెళ్తున్న కారు వాహనం వేగంగా వచ్చి సూర్యనారాయణను వెనుక నుండి బలంగా ఢీకొనడంతో రక్తపు గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందరన్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమన్నీరవుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న హైవే పోలీస్, నేషనల్ హైవే పెట్రోలింగ్ సిబ్బంది కలిసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

వరిపొలాల్లో వ్యవసాయాధికారి సందర్శన

విశాలాంధ్ర - గండేపల్లి : మండలంలోని మురారి గ్రామంలో గురు వారం మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి క్షేత్రస్థాయిలో వరి పొలాలు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకూ కేవలం మం డలంలో 35శాతం మాత్రమే నాట్లు పూర్తి అయ్యామని త్వరితగతిన ఈనెల 20 లోపు రైతులు వరినాట్లు 100 శాతం పూర్తి చేసుకోవాలని, నాటేటప్పుడు వరినారు చివరలు త్రుంచడం ద్వారా కాండం తొలుచు పురుగు చేసే నష్టాన్ని నివారించవచ్చని అలాగే నాటిన 25-30 రోజులు లోపు కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 4జి గుళికలు ఎకరానికి 8 కేజిలు చొప్పున చల్లడం ద్వారా కూడా కాండం తొలుచు పురుగు చేసే నష్టాన్ని నివారించవచ్చన్నారు. ప్రస్తుతం మండలంలో 1920 లక్ష్యానికి కౌలు కార్డులకు 421 జారి అయ్యాయని రెవెన్యూ-వ్యవసాయ శాఖలు సంయుక్తంగా కౌలు కార్డు అర్హత గల ప్రతి కౌలు రైతు పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మురారి-1 ఉద్యాన సహాయకులు ఎన్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరి : మంత్రి దుర్గేష్

విశాలాంధ్ర - నిడదవోలు : బానిస సంకెళ్లతో ఉన్న భారతదేశ ప్రజలకు స్వేచ్ఛ వాయువుల ప్రసాదించాలనే లక్ష్యంతో, దేశానికి స్వాతంత్రాన్ని తీసుకురావాలన్న ప్రారంభించిన తొలి రోజుల్లోనే మనకు నాయకత్వం వహించిన నాయకుడు అల్లూరి సీతారామరాజు అని వారి జయంతి ఉత్సవాల్లో పాల్గొని నివాళులర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నారని పర్యాటక సాంస్కృతిక సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక గాంధీ నగర్ సెంటర్లో ఉన్న అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి మంత్రి కందుల దుర్గేష్ స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ మన్యంలో ఉన్నటువంటి గిరిజనుల సమస్యల అర్థం చేసుకొని వాటిని పరిష్కరించే దిశగా బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాటం చేసిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. మితవాదం అనేవారు సాయుధ పోరాటాలు సరైన విధానం కాదు అహింస ద్వారానే స్వతంత్రాన్ని సంపాదించుకోవాలని గోపాలకృష్ణ గోకిలే, మహాత్మా గాంధీ వంటి వారు ముందుకు నడవగా, బ్రిటిష్ వారిని పారద్రోలాలంటే వారితో పాటు సమానమైన శక్తి సామర్థ్యాలు మనకు ఉండాలని అతివాదం మార్గాన్ని సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామ రాజు, బాలగంగాధర్ తిలక్ వంటి నాయకులు ఎన్నుకొని ముందుకు నడిచారని మంత్రి అన్నారు. భారతదేశాన్ని సర్వసత్తాక ప్రజాస్వామిక గణ తంత్ర దేశంగా ప్రపంచ దేశాల ముందు నిలపాలనదే ఆ మహనీయుల ధ్యేయంగా పేర్కొన్నారు. మన ప్రాంతమైన ఉభయగోదావరి జిల్లాలు, విశాఖపట్నంకు చెందిన అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజల సమస్యలను పోరాట స్ఫూర్తితో ఆదుకోవాలని లక్ష్యంగా సాయుధ పోరాటాన్ని ఎంచుకొని గిరిజనులకు అండగా నిలిచి వారిని బలోపేతం చేశారన్నారు. గిరిజనులకు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనే మనోధైర్యాన్ని కలిగించారన్నారు. ఆయన జీవించిన కాలం కేవలం 27 సంవత్సరాలు మాత్రమేనని అయినప్పటికీ ఆయన పేరు శత సహస్ర వసంతాలపాటు నిలిచేలా పోరాట ఉద్యమం చేసిన నేతని మంత్రి పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం పండుగ వాతావరణంలో చేస్తుందని, ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు నడవాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. . ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

అలుపెరగని పోరాట యోధుడు అల్లూరి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : అలుపెరగని పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని సీపీఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు కొనియాడారు. అల్లూరి సీతారామ రాజు జయంతిని పురస్కరించుకుని మండలంలోని భద్రవరం గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ భారత స్వతంత్ర సంగ్రామ చరిత్రలో అల్లూరి పోరాటాలు ఎనలేనివని కొనియాడారు. సీఐటీయూ నాయకుడు పిల్ల రాంబాబు మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి పోరాటాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రౌతు సత్యనారాయణ, వేమగిరి దొంగబాబు, గుండుబిల్లి చక్రం, బత్తుల వీర్రాజు, ద్వారపురెడ్డి ప్రసాద్, టి వీరవెంకటసత్యనారాయణ, డి సీతారామరాజు, నమ్మి సూర్యారావు తదితరులు ఉన్నారు.

ఏలేశ్వరంలో : స్థానిక వినోద్ మిశ్రా నగర్‌లో సిపిఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి కోసిరెడ్డి గణేష్ అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొంతం రాజు, కందుల క్రాంతి కుమార్, కోన గంగాధర్, గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, కందుల వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో : ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ డి సునీత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు ప్రగడ ప్రయాగమూర్తి, కె వెంకటేశ్వరరావు, వి రామారావు, కె సురేష్, ఎస్కె మదీనా, శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

పెరవలి : మండలంలోని ఖండవల్లి అజరం గ్రామాలలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పలువురు పూలదండలు వేసి నివాళులు అర్పించారు.అజ్జరం గ్రామంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి దుర్గేష్ పాల్గొని పూలదండ వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చేసిన గొప్ప కార్యాలను గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో అధికారులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

సీతానగరం: పలివెల వీరబాబు ఆధ్వర్యంలో ఘనంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు. దీనిలో భాగంగా గురువారం సీతానగరం నాలుబొమ్మల సెంటర్, చినకొండేపూడి వడ్డీల కమిటీ హాల్ సెంటర్ , లక్ష్మీదేవి గుడి సెంటర్,సూర్య చంద్ర పబ్లిక్ స్కూల్ సెంటర్ నందు ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి పలువురికి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ భారతదేశ స్వతంత్రం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహా వ్యక్తి అల్లూరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలివెల జ్యోతి, చిట్టి స్వామి, సిద్దే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం : విప్లవ వీరుడు బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన తెలుగువాడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఉత్సవాలు చినకొత్తలంకలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా పి ఉదయ భాస్కర వర్మ మాట్లాడుతూ గిరిజనుల పాలిట శ్రీరాముడుగా పోరాడి బ్రిటిష్ వారిని సైతం కంటి మీద కునుకు లేకుండా చేసిన విప్లవ జ్యోతి స్వతంత్రయ పోరాటం అజ రామ రమని పేర్కొన్నారు. అనంతరం క్షత్రియ యువకులు భారీ కేకు కట్ చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పి నాగేంద్ర వర్మ, యమ్ పద్మనాభ రాజు, పి శ్రీనివాస వర్మ, పి పణి వర్మ, పి వినయవర్మ, పి సాయివర్మ, పిలక్ష్మీ శ్రీనివాసరాజు, పి చైతన్య వర్మ పాల్గొన్నారు.

అల్లవరం : అల్లవరం మండలం కోడూరుపాడు గ్రామంలో విప్లవ జ్యోతిని రగిలించిన విప్లవ కారుడు, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన స్వాతం త్ర్య సమరయోధుడు, మన్నెంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అల్లవరం మండల అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణ రాజు, కోడూరుపాడు సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు. ముందుగా అల్లూరి సీతారామరాజు విగ్ర హానికి ఆనందరావు గజమాల వేసి ఘన నివాళులు అర్పిం చారు. కేక్ కట్ చేసి అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి నాయకులు, సమన్వయ కమిటీ నాయకులు, రాష్ట్ర జిల్లా స్థాయి నాయ కులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, సెక్రటరీలు, క్లస్టర్లు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొవ్వూరు : కొవ్వూరులో గోదావరి మాత క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరిసీతారామ రాజు 127వ జయంతి వేడుకలలో కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోసబ్ కలెక్టర్ ఆశితోష్ శ్రీవత్సవ, మున్సిపల్ ఛైర్పర్సన్ భావన రత్నకుమారి, టుమెన్ కమిటీ సభ్యులు, జొన్నలగడ్డ చౌదరి, కంటమణి రామకృష్ణ, పట్టణ జనసేన అధ్యక్షులు దేగల రాము, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అనపర్తి : భారతదేశ స్వతంత్రం కోసం బ్రిటీష్ వారిపై పోరాడిన అల్లూరి సీతా రామరాజు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని బి జె యం వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శివ రామకృష్ణంరాజు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు సిరసపల్లి నాగేశ్వరరావు అన్నారు.గురువారం అల్లూరి సీతా రామరాజు జయంతి సందర్భంగా లక్ష్మీ నరసాపురంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి కూటమి నేతలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో కూటమి నేతలు గంజా హరిబాబు, నాగభూషణం రాజు, శ్రీను రాజు, జగదీష్, పూర్ణానంద రాజు, సుబ్బరాజు,వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాటంతోనే పెన్షన్ పెంపు

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని స్థానిక అంబేడ్కర్ భవనం నందు వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం జరిగింది. రాజోలు మండల విహెచ్‌పిఎస్ అధ్యక్షులు కట్టా శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవ మూర్తి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో దివ్యాంగులకు 6000 రూపాయిల పెన్షన్స్, మొదలగు సంక్షేమ పథకాలు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పోరాటం ఫలితంగా వచ్చాయని కొనియాడారు. అనంతరం దివ్యాంగులకు పెన్షన్ పెంచిన కూటమి నేతల చిత్రపటానికి పాల అభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన....



విశాలాంధ్ర- పెరవలి : సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అందరికి అవగాహన కల్పించాలని పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎ యస్ కృష్ణవేణి అన్నారు. గురువారం పెరవలి ఐసిడిఎస్ కార్యాలయంలో మండలంలోని అంగన్వాడీ సిబ్బందికి పలు అనారోగ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 1వ తేది నుండి ఆగస్టు 31 వ తేదీ వరకు జరుగుతున్న స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ సిబ్బందికి అతిసార వ్యాధిపై అవగాహన కల్పించడం జరి గింది.గ్రామాలలో అంగన్వాడీ వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని అన్నారు.ఈకార్యక్రమంలో సిడిపిఓ శ్రీలక్ష్మి సిహెచ్ఓ రమణ మూర్తి అంగన్వాడీ సూపర్ వైజర్లు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి రంగా

విశాలాంధ్ర - అమలాపురం : బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి కీర్తిశేషులు వంగవీటి మోహన రంగా 77వ జయంతి సందర్భంగా కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ స్థానిక మహిపాల వీధిలో వంగవీటి మోహన రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పైడికొండల రంగయ్య నాయుడు, అబ్బిరెడ్డి మూర్తి, పప్పొప్పుల తనేష్, గారపాటి బాలాజీ, వల్లభ రెడ్డి వాసు, సత్తి శివ, అబ్బిరెడ్డి అరవింద్, గుర్రాల రమేష్, బండారు సంతోష్ (ఫ్రెండ్స్) తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం సొమ్ము జమ

విశాలాంధ్ర - కరప : రైతులు తమ పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా అమ్మగా నేటికి రైతులకు డబ్బులు జమ కాక పోవడంతో కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీ దృష్టికి కరప మండల జనసేన పార్టీ అధ్యక్షులు బండారు మురళి రైతులను తీసుకుని ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. ఎమ్మెల్యే నానాజీ వెంటనే స్పందించి పై అధికారులకు ఫోన్ చేయగా రైతుల ఎకౌంట్లో డబ్బులు జమ చేయడం జరిగిందని మురళి తెలిపారు. దీనిపై జడ్ భావరం, గొడ్డటిపాలెం, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు ముత్యాలరావు, ఉదయ్ శంకర్, సూరిబాబు, కొప్పిశెట్టి బుజ్జి శ్రీను, పప్పినీడి బాబ్జి, పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ పట్టణంలో పర్యావరణానికి హాని కలిగించే కోనకార్పస్ చెట్టులను తొలగించి వాటి స్థానంలో ప్రాణ వాయువు విడుదల చేసే మొక్కలు నాటేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో కోనకార్పస్ చెట్టుల తొలగింపు, ఫ్లెక్సీలు లేని స్ట్రీట్ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్, హార్టీకల్చర్, అటవీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గుపులుసు వాయువు అధికంగా విడుదల చేసే కోనాకర్పస్ తొలిగించి, ప్రాణవాయువు అందించే మొక్కలను పెంచేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాకినాడ పట్టణం పరిధిలో సుమా రుగా 4,602 కోనకార్పస్ చెట్టు గుర్తించినట్లు మున్సిపల్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా అటవీ శాఖ అధికారులను సమన్వయం చేసుకుని తొలగించిన చెట్ల స్థానంలో వెంటనే ఆక్సిజన్ విడుదల చేసే మొక్కలు నాటేందుకు ప్రణాళిక చేయాలని ఆయన స్పష్టం చేశారు. కాకినాడ పట్టణంలో ఫ్లెక్సీలు తొలిగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. వాటిని తొలిగించి చేందుకు వచ్చే సోమవారం వరకు అవకాశం ఇవ్వాలన్నారు. గడువులోగా తొలగించని ఫ్లెక్సీలను మంగళ వారం జూలై 9న మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తొలిగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో కాకినాడ కమిషనర్ వెంకటరావు, టౌన్ ప్లానింగ్ అధికారి కె హరిదాస్, హార్టీకల్చర్ ఏడి టీవీ సరీల్, కాకినాడ సోషల్ ఫారెస్ట్ ఎఫ్ఆర్వో బి పద్మజ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వనరుల సమీకరణ వివరాలు వెల్లడి

విశాలాంధ్ర - కాకినాడ : ఈ శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణలో భాగముగా డాక్టర్ యస్ ఎల్ఎన్‌టి శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్, నేషనల్ కౌన్సిల్ ఫర్ కోఆపరేటివ్ ట్రైనింగ్, కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం మరియు వెంకట కృష్ణ జిల్లా సహకార అధికారి, ప్రవీణ్ కుమార్, జనరల్ మేనేజర్ గురువారం సాగిలి షాన్ మోహన్ ఐఎఎస్ జిల్లా కలెక్టర్‌ని కలిసి సిఎస్‌సి పోర్టల్ పై ట్రైనింగ్స్ గురుంచి వివరించారు. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ అండ్ నాబార్డ్ సమన్వయంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘములను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ సంఘములను కామన్ సర్వీస్ సెంటర్స్‌గా సభ్యులకు సేవలు అందించుటకు వీలుగా నిర్ణయం తీసుకోవడం జరిగినది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘములు ఈ కామన్ సర్వీస్ సెంటర్స్ పోర్టల్ ద్వారా ప్రభుత్వపరమైన సేవలు, నైపుణ్యతారంగం, బ్యాంకింగ్ మరియు ఇన్సూరెన్స్ రంగాలకు సంబంధించిన ఆన్ లైన్ సర్వీసెస్ అందించడం ద్వారా సంఘమునకు ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం సంఘ సభ్యులకు విభిన్న సేవలను సకాలంలో అందించడం జరుగుతుందని డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఈ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన 32 సేవలు రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన 174 సేవలు అందుబాటులోకి రానున్నవి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘములోని కార్యనిర్వాహణ అధికారులకు అవగాహన నైపుణ్యతను

పెంచడానికి కేంద్ర సహకార శాఖ, రాష్ట్ర సహకార శాఖ రాష్ట్ర సహకార బ్యాంకు సంయుక్తంగా శిక్షణ కార్యక్రమములను నిర్వహించడం జరిగినది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకి సంబందించిన 288 కార్య నిర్వహణ అధికారులు, డేటా ఆపరేటర్స్ ఈ నెలలో 4-9తేదీలలో నిర్వహించబోతున్న ఈ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటారని, ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమాల ద్వారా సియస్‌సి పోర్టల్‌లో నైపుణ్యం పొందాలని జిల్లా సహకార అధికారి వెంకట కృష్ణ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమాలలో అన్ని పిఎసిఎస్ పాల్గొనేటట్టు సూచనలు అందించినట్లు ప్రవీణ్ కుమార్, జనరల్ మేనేజర్ చెప్పారు. ఈ పోర్టల్‌లోని వివిధ అంశాలను సేవలను ఆదిత్య, డిస్ట్రిక్ట్ మేనేజర్, సియస్‌సి ఏపీ, వారి టీం సభ్యులు సమగ్రముగా వివరిస్తున్నారు.

మహిళా కార్మికుల తొలగింపు ఆపాలి : సీఐటీయూ

విశాలాంధ్ర - యానాం : కేంద్రపాలిత ప్రాంతం యానాం అడవి పాలెం పరిసర ప్రాంతంలో గత 5 సంవత్సరాల క్రితం సెల్డమ్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ స్థాపించడం జరిగింది. సుమారు 70 మంది వరకు మహిళా కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో పనిచేసే మహిళా కార్మికులకు కనీస సౌకర్యాలు అమలు చేయకుండా మహిళా కార్మికుల శ్రమను దోచుకుంటూ రోజుకు 200 మాత్రమే యాజమాన్యం చెల్లిస్తున్నారు. వీరు ఎవరికి ఈఎస్ఐ గాని, పిఎఫ్ గాని అంటే ఏమిటో తెలియదు. అడిగితే ఇష్టమైతే పని చేయండి లేకపోతే పోండి అనే పరిస్థితి ఏర్పడింది. యాజమాన్యం పరిస్థితి గతంలో జనరల్ డ్యూటీ ఐదున్నర గంటలకు వదిలేవారు. గత నాలుగు నెలల నుండి 6 గంటల వరకు పని చేయించుకుంటున్నారు. పని చేసిన అదనపు గంటలకు వేతనం కట్టి ఇవ్వడం లేదు. ఇవి అడిగినందుకు రాయుడు ప్రసన్న, చోడే మంగాదేవి, నందికి శ్రీదేవి, రమణ అనే మహిళ కార్మికులను అక్రమంగా తొలగించారు. ఎందుకు తొలగిస్తున్నారు కార్మికులకు చెప్పడం లేదు. ఎటువంటి నోటీస్ ఇవ్వకుండా నిబంధనలకు వ్యతిరేకంగా సెల్డమ్ యాజమాన్యం వ్యవహరిస్తున్నది. ఈ విషయం సిఐటియు దృష్టికి రావడంతో సిఐటియు నాయకులు అక్రమ తొలగింపులు ఆపాలని తొలగించిన కార్మికులను విధుల్లోనికి తీసుకోవాలని కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్, మెటర్నటీ లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ మేనేజర్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి దుర్గాప్రసాద్, యానాం సిఐటియు కన్వీనర్ కే సత్యనారాయణ, మరియు సబ్బతి రాంబాబు, త్రికోటి శ్రీనివాసరావు, దాసరి రాజు, సలాది నాగబాబు ఉన్నారు.

చంద్రబాబుకు పాలాభిషేకం

విశాలాంధ్ర - జగ్గంపేట : విభిన్న ప్రతిభావంతుల పింఛన్‌ను 6 వేలకు పెంచడంతో ఆనందంతో వారు సీఎం చంద్ర బాబు చిత్రపటానికి పాలాబి షేకం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం రాత్రి చెవిటి, మూగకు చెందిన పలువురు విక లాంగులు పాలాభిషేకం నిర్వహించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ఘనంగా సత్కరించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి కాకినాడ జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు మండపాక అప్పన్నదొర మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని అన్నారు.

అవినీతి ప్రక్షాళనతో పవన్ స్థాయి పెరిగింది

కాపు రిజర్వేషన్ పోరాట సమితి సీనియర్ నాయకుడు నాగభూషణం

విశాలాంధ్ర - అమలాపురం : ఎన్డీఏ కూటమిలో ప్రధానపాత్ర పోషించి కూటమి అఖండ విజయానికి కృషి చేయడంతో పాటు, పిఠాపురంలో అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కాపు ఉద్యమ నేత త్సవటపల్లి నాగభూషణం శుభాకాంక్షలు తెలిపారు. కాట్రేనికోన మండలం చెయ్యేరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన రాష్ట్ర కాపు ఉద్యమ నేత త్సవటపల్లి నాగభూషణం. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన భూమిక పోషించి ఎన్డీఏ కూటమి కట్టడంలో ప్రధానోపాత్ర పోషించి కూటమి అఖండ విజయానికి కృషి చేయడంతోపాటు పిఠాపురంలో అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన పవన్ కళ్యాణ్‌కి శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున తనకు వచ్చే నెలవారీ ఖర్చులు జీతభత్యాలు కూడా తీసుకోకుండా తనకి ప్రజలు ఇచ్చిన బాధ్యతను ఎంతో హుందాగా వ్యవహరిస్తూ తాను తీసుకున్న శాఖలకు అత్యధిక సమయాని కేటాయించి పనిచేయటం ఆనందదాయకం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్ అటవీ శాఖ ఆర్డబ్ల్యుఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల నుండి ప్రక్షాళన మొదలవ్వాలని కాపు రిజర్వేషన్ పోరాట సమితి సీనియర్ నాయకులు త్సవటపల్లి నాగభూషణం ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు పంచాయతీరాజ్ ఆర్డబ్ల్యుఎస్ వర్కుల్లో 50% కమిషన్ రూపంలో అధికారులు నాయకులు జేబుల్లో పోతున్నది. మీరు నిర్వహించే శాఖలో అధికారుల నుండి ప్రతి సంవత్సరం ప్రాపర్టీ రిటర్న్స్ చూపిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీతాలకు పని చేసే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిలో భాగంగా ఏ విధమైన పక్షపాతం లేకుండా కులాలకు అతీతంగా పారదర్శకంగా ఎవరి శాఖలో వాళ్ళు బదిలీల విషయంలో ఎటువంటి పైరవీలకు బదిలీలు తావు లేకుండా బదిలీలు జరగాలని కోరుకుంటున్నాము. పైరవీలు ఆధా రంగా బదిలీలు జరగటం వలన అధికారులు చేతివాటం చూపించడం గత ప్రభు త్వంలో జరగడం వలన ప్రజలు ఇబ్బందులకు గురికావడం జరిగింది. ఈ విధమైన కార్యక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా చూడాలని కోరారు. గతంలో రాష్ట్రంలో ఆ కులం వారు అన్ని ప్రముఖ శాఖలో వారి కులాల వారిని ఉద్యోగులుగా నియమించుకుని అధికార పక్షం కార్యకర్తలుగా వ్యవహరించే విధానాన్ని ఈ ప్రజా ప్రభుత్వం నుండి స్వస్తి పలికే చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నామని కాపు రిజర్వేషన్ పోరాట సమితి సీనియర్ నాయకులు త్సవటపల్లి నాగభూషణం కోరారు. కార్యక్రమంలో టిపివిఎం స్వామి, గ్రామ ఉపసర్పంచ్ బసవ మురళి, కాయల బలరాం, త్సవటపల్లి మణికుమార్, నంద్యాల సురేంద్ర, కానూరు ప్రకాష్, త్సవటపల్లి హేమంత్ కుమార్, చిక్కాల నాగేంద్ర లక్ష్మీనారాయణ, టి కృష్ణమూర్తి పాల్గొన్నారు.